## మేఘాద్రిగెడ్డలో వినాయక నిమజ్జనం నిషేధం: సీఐ

విశాలాంధ్ర - పెందుర్తి : పెందుర్తి పోలీస్ స్టేషన్ పరిధిలోని మేఘాద్రిగెడ్డ డ్యామ్ మంచినీటి వనరుగా ఉన్నందున, ఆ డ్యామ్‌లో వినాయక విగ్రహాల నిమజ్జనం చేయరాదని పెందుర్తి సిఐ కేవీ సతీష్ కుమార్ నిర్వాహకులకు సూచించారు. దీనికి సంబంధించి డ్యామ్ చుట్టూ ఫ్లెక్సీలను ఏర్పాటు చేయించారు. పోలీసు శాఖ నుంచి స్పష్టమైన ఉత్తర్వులు జారీ చేయబడినందున, ఎవరు ఈ నిబంధనను ఉల్లంఘించి డ్యామ్‌లో విగ్రహాలను నిమజ్జనం చేయరాదని, నిబంధనలు ధిక్కరించిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. మంచినీటి డ్యామ్ కలుషితం కాకుండా కాపాడవలసిందిగా కోరుతున్నట్లు సిఐ సతీష్ కుమార్ ప్రకటించారు.

# స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణ జరగదు

### జనసేన సభలో డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్



విశాలాంధ్ర బ్యూరో - విశాఖపట్నం: విశాఖ స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణ ఆపమని జనసేన అని ఆ పార్టీ అధినేత, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ అన్నారు. శనివారం రాత్రి విశాఖలో దక్షిణ నియోజకవర్గం ఇందిరా ప్రియదర్శిని స్టేడియంలో అల్లూరి సీతారామరాజు ప్రాంగణంలో నిర్వహించిన 'సేనతో సేనాని' సభలో ఆయన మాట్లాడారు. విశాఖ స్టీల్ ప్లాంట్ ప్రైవేటీకరణపై జనసేన పోరాడింది అన్నారు. కేంద్రం స్టీల్ ప్లాంట్ ప్రైవేటీకరణ చేయదని, దాన్ని ఆదుకునేందుకే ప్రతి ఆట నిధులు ఇస్తుందన్నారు. విశాఖ కేంద్రంగా రైల్వే జోన్ సాధించుకున్నామని గత ప్రభుత్వం జోన్ ఏర్పాటుకు భూమి కూడా ఇవ్వలేదన్నారు. పోలవరం నిర్మాణంతో పాటు రాష్ట్రంలో అనేక హామీలను నెరవేరుస్తున్నామని తెలిపారు. జనసైనికుల కష్టం వల్లే ఎంతమంది నాయకులు ఈరోజు పదవులు అనుభవిస్తున్నారని, రానున్న రోజుల్లో క్రియాశీలక రాజకీయాల్లో జనసైనికులు రావాలని పిలుపునిచ్చారు. దసరా తర్వాత ఆయుధప పూజ చేయాల్సిందేనని చెప్పారు. ఎన్ని కష్టాలు వచ్చినా తట్టుకుని నిలబడ్డాం కాబట్టే కూటమిగా ఏర్పడి ప్రభుత్వంలో భాగస్వామ్యం అయ్యామన్నారు. గత ప్రభుత్వంలో విశాఖలో తనను ఎంతగానో నిర్బంధించారని అందుకోసం అండగా నిలబడిన వారందరికీ కృతజ్ఞతలు తెలిపారు. ఏ సిద్ధాంతాలు, నిబద్ధతతో వచ్చామో ఇప్పటికే అలాగే ఉన్నామని చెప్పారు. తెలిపారు. కులం, కుటుంబం, రాష్ట్రం, ప్రాంతం కోసం పెట్టిన పార్టీ జనసేన కాదని, ఉద్దానం కిడ్నీ బాధితుల సమస్యలు పరిష్కారం కోసం, ఏజెన్సీలో డోలీ మోతలు లేకుండా రోడ్లు వేస్తున్నామని చెప్పారు. ప్రజల కష్టాలు పరిష్కరించి నప్పుడు జనసేన పార్టీ పెట్టడం నా నిర్ణయం సరైందే అనిపించిందన్నారు. ఇకపై పార్టీ సంస్థాగతంగా నిర్మాణం జరగాలని, మండల స్థాయి నాయకుడితో తానే స్వయంగా మాట్లాడుతానని పవన్ తెలియజేశారు. రాజకీయ వ్యూహంతోనే కూటమి ద్వారా అధికార భాగస్వామ్యం అయ్యామన్నారు. ఈ సభలో జనసేన మంత్రులు నాదెండ్ల మనోహర్, కందుల దుర్గేష్, తో పాటు పవన్ కళ్యాణ్ సోదరుడు ఎమ్మెల్సీ నాగబాబు, ఎమ్మెల్యేలు వంశీకృష్ణ శ్రీనివాస్, కొణతాల రామకృష్ణ, పంచకర్ల రమేష్ బాబు, సుందరపు విజయ్ కుమార్ తోపాటు జనసైనికులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. ఇతర రాష్ట్రాల నుంచి సభకు వచ్చిన అభిమానులకు పవన్ కళ్యాణ్ కృతజ్ఞత లు తెలిపారు.

# పర్యాటకుల గమ్యస్థానంగా విశాఖ: మంత్రి దుర్గేష్

విశాలాంధ్ర బ్యూరో- విశాఖపట్నం: ఏపీ పర్యాటక రంగం అనగానే ముందుగా విశాఖ గుర్తొస్తుందని పర్యాటక శాఖ మంత్రి కందుల దుర్గేష్ అన్నారు. అప్పుఘర్ వద్ద హరిత యాత్రి నివాస్ ఆధునీకరణ పనులను ఎంపీ శ్రీ భరత్, నగర మేయర్ పీలా శ్రీనివాస్‌తో కలిసి ప్రారంభించారు. అనంతరం మంత్రి మీడియాతో మాట్లాడుతూ విశాఖకు వచ్చే పర్యాటకుడు అరకువ్యాలీ, సింహాచలం, అరసవల్లి, స్థానికంగా ఉండే ప్రాంతాలు చూసేలా సర్క్యూట్‌లు ఏర్పాటు చేస్తున్నామన్నారు. 14 టూరిస్ట్ పాయింట్లు పర్యాటకులు సందర్శించేలా ప్రణాళిక చేశామన్నారు. మొదట్లో రూ.500 టికెట్ ధర ఉండాలని నిర్ణయించామన్నారు. కానీ సీఎం చంద్రబాబునాయుడు పెద్దలకు రూ.250, చిన్న పిల్లలకు రూ.100 టికెట్ ధర ఉంచాలని ఆదేశించారన్నారు. తద్వారా ఉదయం రూ.250 టికెట్ తీసుకున్న పర్యాటకులు రోజంతా బస్సులో ప్రయాణించవచ్చన్నారు.

**పర్యాటక ఆదాయం కొల్లగొట్టి రుషికొండ ప్యాలెస్ నిర్మాణం**

శుక్రవారం డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్, జనసేన ప్రజాప్రతినిధులతో కలిసి రుషికొండ ప్యాలెస్‌ను పరిశీలించామని మంత్రి దుర్గేష్ తెలిపారు. పర్యాటక శాఖకు ఏటా రూ.7 కోట్ల ఆదాయం వచ్చే హరిత రిసార్ట్ స్థానంలో గత ప్రభుత్వం రూ.434 కోట్లతో రుషికొండ ప్యాలెస్‌ను నిర్మించడం వల్ల తద్వారా పర్యాటక ఆదాయం కోల్పోయామన్నారు.

కేంద్ర ప్రభుత్వ సహకారంతో రాష్ట్ర పర్యాటకాభివృద్ధి

కేంద్ర ప్రభుత్వం పర్యాటకాభివృద్ధికి ఇతోధికంగా సాయం చేస్తుందన్నారు. ఇప్పటికే శాస్కి ద్వారా అఖండ గోదావరి ప్రాజెక్టు, గండికోట, స్వదేశీ దర్శన్ 2.0 ద్వారా ప్రసాద్ సూర్యలంక బీచ్ అభివృద్ధి చేస్తున్నామన్నారు. ప్రసాద్ స్కీమ్ ద్వారా ఆలయాలు అభివృద్ధి చేస్తున్నామన్నారు. 1/70 చట్టానికనుగుణంగా తాము గిరిజన ప్రాంతాల్లో పర్యాటక అభివృద్ధి చేపడుతున్నామని స్పష్టం చేశారు.

**వైసీపీ హయాంలో పర్యాటక రంగం పూర్తిగా నిర్వీర్యం**

వైసీపీ పాలనలో పర్యాటక రంగం పూర్తిగా నిరాదరణకు గురైందని, ఈ రంగాన్ని నిర్వీర్యం చేశారని తీవ్రంగా విమర్శించారు. దీంతో రాష్ట్రంలోని యువతకు ఉపాధి అవకాశాలు గణనీయంగా తగ్గాయని ఆయన ఆరోపించారు. సమావేశంలో టూరిజం శాఖ సీఈవో ఈశ్వరయ్య, రీజినల్ డైరెక్టర్ జగదీష్, జిల్లా టూరిజం అధికారి జయ మాధవి ఇతర అధికారులు పాల్గొన్నారు.

## ఉరివేసుకొని ఐటిబిపి కానిస్టేబుల్ ఆత్మహత్య

విశాలాంధ్ర - ఆనందపురం: ఆనందపురం మండలం పందలపాకలోని 56వ బెటాలియన్ ఐటీబీపీ హెడ్ క్వార్టర్స్‌లో విషాద ఘటన చోటుచేసుకుంది. కర్నూలు ధోనె మండలం ఆర్ఎస్ రంగాపురం గ్రామానికి చెందిన కానిస్టేబుల్ (జీడి) జగదల నరేంద్ర నాథ్ (32) శుక్రవారం సాయంత్రం ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. 2014లో కానిస్టేబుల్‌గా నియమితులైన నరేంద్ర నాథ్ గత 15 నెలలుగా ఆనందపురం 56వ బెటాలియన్ యూనిట్‌లో విధులు నిర్వహిస్తున్నాడు. విధి నిర్వహణ అనంతరం సుమారు 7.35 గంటలకు బెటాలియన్ హెడ్‌క్వార్టర్స్‌లోని మామిడి చెట్టుకు నైలాన్ వైర్‌తో ఉరివేసుకొని మృతి చెందాడు. బెటాలియన్ అధికారి సంఘటనా స్థలాన్ని పరిశీలించి అక్కడికక్కడే మృతి చెందినట్లు నిర్ధారించారు. ఈ విషయంపై బెటాలియన్ ఇన్‌ఛార్జి సూరజ్ ప్రకాష్ జోషి ఆనందపురం పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకొని మృతదేహాన్ని ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి కేసు నమోదు చేసి సబ్ ఇన్స్పెక్టర్ సంతోష్ దర్యాప్తు చేస్తున్నారు.

## యంగ్ బాయ్స్ యూత్ ఆధ్వర్యంలో అన్నదానం

విశాలాంధ్ర - కొమ్మాది: వినాయక చవితి ఉత్సవాల్లో భాగంగా యంగ్ బాయ్స్ యూత్ ఆధ్వర్యంలో పాలెం లలితా దేవి ఆలయం సమీపంలో అన్నదానం నిర్వహించారు. కేవీఆర్ క్యాటరింగ్ అధినేత, జిల్లా పార్లమెంటరీ తెలుగు యువత ఉపాధ్యక్షులు గరే గురునాథ్ పాల్గొని కార్యక్రమాన్ని ప్రారంభించారు. భారీ సంఖ్యలో భక్తులు పాల్గొని అన్నసంతర్పణ కార్యక్రమాన్ని జయప్రదం చేశారు. ఈ కార్యక్రమంలో ఆరో వార్డు టీడీపీ బీసీ సెల్ అధ్యక్షులు రెడ్డి సత్య నారాయణ, కుప్పక రామకృష్ణ, పిల్లా రమేష్, కొల్లి బాబ్జి, భాస్కర్‌రావు, పోతిన నాయుడు, కమిటీ సభ్యులు క్రాంతి, నరేంద్ర, వంశీ, శివ, అశోక్, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

## సీఎం సహాయ నిధి చెక్కు పంపిణీ

విశాలాంధ్ర - ఆనందపురం: ఆనందపురం మండలం పాలవలస పంచాయతీ గుడిలోవ గ్రామంలో కొద్ది నెలల క్రితం అనారోగ్యంతో కోరాడ అప్పలరాజు మృతి చెందారు. కుమారుడు ఆనంద్‌కి కూటమి ప్రభుత్వం ముఖ్యమంత్రి సహాయ నిధి ద్వారా 51 వేల 200 రూపాయలు రూపాయలు చెక్కును భీమిలి నియోజకవర్గం మాజీ మంత్రి, ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు తన నివాసంలో శనివారం అందజేశారు. ఈ కార్యక్రమంలో మండల టిడిపి ప్రెసిడెంట్ తాట్రాజు అప్పారావు, సర్పంచ్ బిఆర్‌బి నాయుడు, మద్ది శేఖర్, కోరాడ రమేష్, పాలవలస నారాయణరావు, ఆనంద్, మజ్జి రవి,తదితరులు పాల్గొన్నారు.

## ఉద్యోగ విరమణ సిబ్బందికి సీపీ వీడ్కోలు

విశాలాంధ్ర - విశాఖ క్రైమ్: విశాఖ పోలీస్ కమిషనరేట్ పరిధిలో విధులు నిర్వర్తిస్తూ ఉద్యోగ విరమణ చేస్తున్న ఏడుగురు సిబ్బందిని నగర పోలీస్ కమిషనర్ డాక్టర్ శంఖబ్రత బాగ్చి సన్మానించారు. ఎస్.ఐలు డి.రాము, ఎం.అన్వరాల్ హక్, పి.ఆది నారాయణ, ఏఎస్ఐలు జి.అప్పలరాజు, పి.బాబూరావు, ఉమెన్ ఏ.ఎస్.ఐ డి.అరుణ కుమారి, ఏ.ఆర్.హెచ్.సి.లు ఏ.లోకేశ్వరరావులు ఉద్యోగ విరమణ పొందారు. దీంతో వీరిని కుటుంబ సభ్యులతో కలిపి గురువారం పోలీస్ సమావేశ మందిరానికి ఆహ్వానించారు. పోలీస్ అధికారుల సమక్షంలో వారిని సత్కరించి పదవీ విరమణ శుభాకాంక్షలు తెలిపి వీడ్కోలు పలికారు.

## సీపీఐ నూతన కార్యవర్గానికి అభినందన

విశాలాంధ్ర - తగరపువలస: ఒంగోలులో ఇటీవల జరిగిన సీపీఐ రాష్ట్ర మహాసభల్లో విశాఖ జిల్లా నేతలకు చోటు దక్కడంతో భీమిలి ఏరియా కార్యదర్శి కానూరు రాంబాబు, సహాయ కార్యదర్శి మోర్ అప్పలరాజు, ఆదినారాయణ, సన్నిబాబు, వీర్రాజు, లక్ష్మణరావు అభినందనలు తెలిపారు. చలసాని రాఘవేంద్రరావు, ఏజె స్టాలిన్, ఎ.విమల, ఎస్.కె హుస్సేన్, ఎం.పైడిరాజుకు రాష్ట్ర పార్టీ కార్యవర్గంలో చోటు కలగడం అభినందనీయం అన్నారు.

## అప్పన్నను దర్శించుకున్న ఎమ్మెల్యేలు

విశాలాంధ్ర -సింహాచలం: ఉత్తరాంధ్ర ఆరాధ్య దైవం శ్రీ వరాహ లక్ష్మీ నరసింహ స్వామి వారిని కేంద్ర ప్రభుత్వ కార్యదర్శి అవినాష్ జోషి, విశాఖ దక్షిణ నియోజకవర్గం ఎమ్మెల్యే గణబాబు, కాకినాడ రూరల్ ఎమ్మెల్యే పంతం వెంకటేశ్వరావు తదితరులు దర్శించు కున్నారు. వీరికి డిప్యూటీ ఈఓ రాధ, డీఈ హరి, సహాయ కార్యనిర్వహణాధికారి కె.తిరుమలేశ్వరరావు పూలమాలలు వేసి స్వాగతం పలికారు. తొలుత ఆలయ సంప్రదాయం ప్రకారం కప్పస్తంభం ఆలింగనం చేసుకుని స్వామి వారికి తమ గోత్ర నామాలతో సంకల్పం చెప్పించారు. పిదప వేద పండితులు ఆశీర్వచనం పలికారు. ఏఈఓ స్వామి వారి శేష వస్త్రంతో సత్కరించి తీర్థ ప్రసాదాలను అందజేశారు.

## పేదలకు వరం ముఖ్యమంత్రి సహాయ నిధి

విశాలాంధ్ర - భీమిలి: ఇచ్చిన మాటకు కట్టుబడి రాష్ట్రంలో ఎంత ఆర్థిక లోటు ఉన్నా పేదలకు అందిస్తున్న సంక్షేమం విషయంలో రాజీ పడకుండా పారదర్శకమైన పాలన అందిస్తున్న ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడుకి కృతజ్ఞతలు అని టీడీపీ రాష్ట్ర కార్యదర్శి, అనకాపల్లి నియోజకవర్గం సంస్థాగత ఎన్నికల పరిశీలకులు గంటా నూకరాజు అన్నారు. భీమిలి జోన్ 3వ డివిజన్ తోటవీధి గ్రామానికి చెందిన కర్రి ఎర్రిబాబుకి ముఖ్యమంత్రి సహాయ నిధి నుండి వచ్చిన 89,909 రూపాయల చెక్కును భీమిలి శాసనసభ్యులు గంటా శ్రీనివాసరావు చేతులమీదుగా అందజేశారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు చిక్కాల విజయ్ బాబు, ఎన్.స్వామి పాల్గొన్నారు.

# బుత్తల వారి చెరువు ఆక్రమణ

- లబోదిబోమంటున్న రైతులు
- 1.41 ఎకరాలలో విస్తరించిన చెరువు
- పంట పొలాలు నీటమునక
- ఫిర్యాదు చేసినా పట్టించుకోని అధికారులు

విశాలాంధ్ర - ఆనందపురం: ఆనందపురం మండలం పందలపాక రెవెన్యూ పరిధిలో బుత్తల వారి చెరువు ఆక్రమణ స్థానిక రైతుల జీవితాలను దెబ్బతీస్తోంది.

వరుస వర్షాల కారణంగా చెరువులో నిల్వ కావలసిన నీరు నేరుగా పంట పొలాల్లోకి చేరి ముంపునకు గురవుతోంది. సర్వే నంబరు 17/15లో సుమారు 1- 41 ఎకరాల్లో విస్తరించిన బుత్తల వారి చెరువును కొంతమంది ఆక్రమణదారులు మట్టితో కప్పివేయడంతో, గ్రామాల నుండి వచ్చే వర్షపు నీరు చెరువులో నిల్వ కాకుండా నేరుగా పంట పొలాల్లోకి చేరుతోంది. దీంతో రైతులు సాగుచేసిన బీరకాయ, వంగ, మందారతో పాటు ఇతర తోటలు నీటిలో మునిగి నష్టపోయాయి. గంటపేట, యాతపేట పందలపాక గ్రామాల నుండి వచ్చే వరసపు నీరు చెరువులో చేరవలసి ఉండగా, చెరువు మూసివేత కారణంగా బాలి నారాయణమ్మ,, గంట అప్పారావు, గంట అప్పలరాజు, బాలి లక్ష్మి, గంట వెంకట్రావు, ఈ రుమజ్జీ సూరిబాబు, శ్రీను తదితరుల భూముల్లో పంటలు దెబ్బతిన్నాయి. అదేవిధంగా బుత్తల వారి చెరువు నిండిన నీరు తర్లు వాడ చిరువ చెరువుకు వెళ్లే కాలువలు కూడా మూసుకుపోవడంతో, నీరు బయటకు వెళ్లే మార్గం లేకపోవడంతో పంట పొలాలు చెరువుల్లా మారిపోయాయి. చెరువును ఆక్రమణ నుంచి విముక్తి చేయించి, కాలువలు సరిచేస్తేనే మా పంటలు రక్షింపబడతాయి. లేకపోతే ప్రతి వర్షంలో మాకు ఇదే సమస్య ఎదురవుతుంది" అని రైతులు వాపోతున్నారు. అధికారులు తక్షణ చర్యలు తీసుకోవాలని వారు డిమాండ్ చేస్తున్నారు.

# ప్రాజెక్టుల రూపకల్పనలో పితామహుడు ఈ ఇంజనీర్...

### పదవీ విరమణ పొందిన జీవీఎంసీ వాటర్ సప్లై ఎస్ఈ కెవిఎన్ రవి

విశాలాంధ్ర బ్యూరో- విశాఖపట్నం: ఇంజనీరింగ్ పితామహుడు మోక్షగుండం విశ్వేశ్వరయ్య స్ఫూర్తితో ఇంజనీరింగ్ చదువుకొని 1987లో అసిస్టెంట్ ఇంజనీర్‌గా పబ్లిక్ హెల్త్, పట్టణ పురపాలక శాఖ విభాగంలో ఉద్యోగం పొందిన కెవిఎన్ రవి అంచలంచెలుగా ఎదుగుతూ నేడు జీవీఎంసీలో నీటి సరఫరా విభాగంలో పర్యవేక్షక ఇంజనీర్‌గా విధులు నిర్వహించి పదవి విరమణ చేయనున్నారు. జీవీఎంసీలో అనేక ప్రాజెక్టులకు రూపకల్పన చేశారు. జేఎన్ఎన్‌యు ఆర్ఎం, స్మార్ట్ సిటీ, అమృత్, ఏడిబి, 24 గంటల నీటి సరఫరా పథకంతోపాటు బిఆర్‌టిఎస్, మెట్రో కార్పొరేషన్‌లో, విఎంఆర్డీఏలో, అనేక ప్రాజెక్టులు రూపకల్పనతో పాటు వాటిని అమలు పరచడంలో రవి ఎనలేని కృషి చేశారు. చాకచక్యంగా మాట్లాడి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ సంస్థలకు నిధులు రాబట్టడంలో అనేక సంస్థలతో మెరుగైన సత్సంబంధాలు నిర్వహించారు. ప్రధానమంత్రి, ముఖ్యమంత్రితో పాటు ముఖ్యమైన మంత్రులు, ప్రముఖుల పర్యటన సదర్భంగా రవి వారికి ప్రభుత్వాలు చేపడుతున్న ప్రాజెక్టుల వివరాలను సమగ్రంగా సవివరంగా తెలియజేసేవారు. వివిధ కేంద్ర బృందాలు వచ్చినప్పుడు రవి సమన్వయకర్తగా వ్యవహరించేవారు. సాంకేతిక నైపుణ్యం తోపాటు, పారదర్శకంగా, ప్రణాళిక బద్ధంగా, వాస్తవికత తో ప్రజల ప్రమాణాలకు దోహదపడేలా ప్రాజెక్టులు చేపట్టడంలో ఆయనకు ఆయనే సాటి అన్న ప్రచారం పెద్ద ఎత్తున ఇంజనీరింగ్ విభాగంలో జరిగేది. రాష్ట్రంలో అనేక మున్సిపాలిటీలు, కార్పొరేషన్‌లో పనిచేశారు.

## జనసేనలో చేరిన ఎస్ఏ రహమాన్

విశాలాంధ్ర బ్యూరో- విశాఖపట్నం: మాజీ ఎమ్మెల్యే, మాజీ ఉడా చైర్మన్ ఎస్ఏ రెహమాన్ శనివారం జనసేన పార్టీ అధినేత, రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ సమక్షంలో జనసేన పార్టీలో చేరారు. ఈ సందర్భంగా పవన్ కళ్యాణ్ కండువా వేసి రెహమాన్ ను పార్టీలోకి ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర మంత్రి నాదెండ్ల మనోహర్ , స్థానిక ఎమ్మెల్యే, జనసేన పార్టీ విశాఖపట్నం నగర అధ్యక్షులు వంశీకృష్ణ శ్రీనివాస్ పాల్గొన్నారు. రెహమాన్ తొలిత టిడిపిలో ఉండేవారు, తర్వాత పార్టీ మారిన ఆయన చిరంజీవి పెట్టిన ప్రజారాజ్యం పార్టీలో చేరారు. అప్పటినుండి పవన్ కళ్యాణ్ తో కూడా సత్సంబంధాలు కలిగి ఉన్నాయి. తర్వాత వైసీపీ లో చేరారు. ఎన్నికల తర్వాత వైసీపీకి రాజీనామా చేసిన రెహమాన్ తాజాగా జనసేనలో చేరారు. బిజెపి మినహా అన్ని పార్టీల్లో తిరిగివచ్చిన రెహమాన్ దక్షిణ నియోజకవర్గంలో ముస్లిం మైనారిటీ నాయకుడిగా పట్టు ఉండడంతో జనసేనకు రెహమాన్ రాకతో ఊపు వచ్చినట్టేనని ఆయన వర్గీయులు తెలిపారు. రెహమాన్ చేరికకు దక్షిణ నియోజకవర్గం ఎమ్మెల్యే వంశీకృష్ణ ఎప్పటినుంచో ప్రయత్నం చేశారని ప్రచారం కూడా సాగుతుంది.

# డ్రా ద్వారా బార్ల కేటాయింపు ప్రక్రియ

**131 బార్లకు గాను 263 దరఖాస్తులు**
**67 బార్ల కేటాయింపు**

విశాలాంధ్ర - విశాఖ కలెక్టరేట్: ఆంధ్రప్రదేశ్ గెజిట్ నూతన బార్ పాలసీ 2025-28 నిబంధనలకు అనుగుణంగా జిల్లాలోని మద్యం బార్ల కేటాయింపు ప్రక్రియ పారదర్శకంగా జరిగింది. స్థానిక వీఎంఆర్డీఏ చిల్డ్రన్ ఎరీనాలో శనివారం ఉదయం నిర్వహించిన కార్యక్రమంలో జేసీ కె.మయూర్ అశోక్ ఆశావహుల సమక్షంలో లాటరీ తీసి బార్లను కేటాయించారు. జీవీఎంసీ పరిధిలో 131 (రిజర్వ్ 10ఓపెన్ 121) బార్లకు గాను ఆశావహుల నుంచి 263 దరఖాస్తులు వచ్చాయి. వాటిని పరిశీలించి నూతన బార్ పాలసీ నిబంధనల మేరకు అధికారులు చర్యలు చేపట్టారు. గీత కులాలకు పది, జనరల్ కేటగిరీ అభ్యర్థులకు 57 బార్లను కేటాయిస్తూ లాటరీ ప్రక్రియను పారదర్శకంగా నిర్వహించారు. లాటరీ ప్రక్రియలో ఎక్సైజ్ డీసీ రామచంద్రమూర్తి, సూపరింటెండెంట్ ఆర్.ప్రసాద్, అసిస్టెంట్ సూపరింటెండెంట్ రాజశేఖర్, సీఐలు, ఎస్సైలు తదితరులు పాల్గొన్నారు.

**ప్రభుత్వ ఆదేశాల మేరకు తదుపరి చర్యలు**

నూతన బార్ పాలసీకి అనుగుణంగా లాటరీ ప్రక్రియను అత్యంత పారదర్శకంగా నిర్వహించామని, జీవీఎంసీ పరిధిలో రిజర్వ్‌లో పది, ఓపెన్ కేటగిరీలో 121 కలిపి మొత్తం 131 బార్లు ఉండగా ఆశావహుల నుంచి 263 దరఖాస్తులు వచ్చాయని వాటిని పూర్తిగా పరిశీలించి నిబంధనల మేరకు చర్యలు తీసుకున్నామని జాయింట్ కలెక్టర్ కె. మయూర్ అశోక్ తెలిపారు. వీటిలో గీత కులాలకు పది, ఓపెన్ కేటగిరీలో 57 కలిసి మొత్తం 67 బార్లకు లాటరీ ప్రక్రియ ముగిసిందన్నారు. సంబంధిత నివేదికలను ప్రభుత్వానికి సమర్పిస్తామని, దరఖాస్తులు రాక మిగిలి పోయిన బార్ల విషయంలో ప్రభుత్వ ఆదేశాలకు మేరకు చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు.

# డిసెంబర్ 14న ఆర్కే బీచ్‌లో నేవీ మారథాన్

### సెప్టెంబర్ ఒకటి నుండి రిజిస్ట్రేషన్లు

విశాలాంధ్ర బ్యూరో- విశాఖపట్నం: నేవీ డే వేడుకల్లో భాగంగా నిర్వహించబడుతున్న విశాఖ నేవీ మారథాన్ ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తున్న 10వ ఎడిషన్ వివరాలను వెల్లడించారు. తూర్పు నౌకాదళ కమాండ్ ఆధ్వర్యంలో నిర్వహించ బడుతున్న ఈ మారథాన్, డిసెంబర్ 14, 2025 (ఆదివారం)న ఆర్కే బీచ్, విశాఖలో జరగనుంది. ఈ సందర్భంగా ఫిట్‌నెస్, స్నేహభావం కమ్యూనిటీ భాగస్వామ్య స్ఫూర్తిని మరోసారి ప్రదర్శించనుంది. ఈ మీడియా సమావేశంలో ఐఎన్ఎస్ కళింగ కమాండింగ్ ఆఫీసర్, వివిఎం-25 రేస్ డైరెక్టర్ కమోడోర్ అనిరుధ రాయ్ మాట్లాడుతూ ఈ ప్రతిష్టాత్మక ఈవెంట్ కోసం చేపట్టిన ఏర్పాట్లను వివరించారు. ఈ కార్యక్రమానికి జీవీఎంసీ కమిషనర్ కేతన్ గార్గ్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ మారథాన్‌కు స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా టైటిల్ స్పాన్సర్‌గా కొనసాగనుంది. రిజిస్ట్రేషన్లు 2025 సెప్టెంబర్ 1 నుండి అధికారిక వెబ్‌సైట్ www.vizagnavymarathon.run ద్వారా ప్రారంభం కానున్నాయి. 42.195 కి.మీ. పూర్తి మారథాన్, 21.097 కి.మీ. హాఫ్ మారథాన్, 10 కి.మీ. రన్, 5 కి.మీ. ఫన్ రన్, రేస్ మార్గాలు పూర్తి మారథాన్, హాఫ్ మారథాన్, 10 కి.మీ. రన్స్ అన్నీ ఆర్కే బీచ్ నుండి ప్రారంభమవుతాయి. కమోడోర్ అనిరుధ రాయ్ మాట్లాడుతూ 2014లో 4,000 మంది పాల్గొన్న ఈ మారథాన్, 2024 నాటికి 14,000 మందికి పెరిగిందన్నారు. ఈసారి గత అన్ని ఎడిషన్ల కంటే ఎక్కువ సంఖ్యలో పాల్గొనేవారు ఉండే అవకాశం ఉందన్నారు. జీవీఎంసీ కమిషనర్ కేతన్ గార్గ్ మాట్లాడుతూ విశాఖ నేవీ మారథాన్ కేవలం క్రీడా కార్యక్రమం మాత్రమే కాదని, విశాఖ నగర ఆరోగ్యం, ఫిట్‌నెస్, సంక్షేమం పట్ల ఉన్న సామూహిక నిబద్ధతకు ఒక వేడుక అన్నారు.

## జీవీఎంసీ వాటర్ సప్లై ఎస్ఈగా ఏడుకొండలకు అదనపు బాధ్యతలు

విశాలాంధ్ర బ్యూరో- విశాఖపట్నం: జీవీఎంసీ వాటర్ సప్లై విభాగంలో సూపరిండెంట్ ఇంజనీర్‌గా పనిచేస్తున్న కెవిఎన్ రవి పదవి విరమణ చేయడంతో ఆయన స్థానంలో జీవీఎంసీ ప్రాజెక్ట్ విభాగంలో కార్యనిర్వాహక ఇంజనీర్‌గా పనిచేస్తున్న సిహెచ్ ఏడుకొండలకు వాటర్ సప్లై ఎస్ఈగా అదనపు బాధ్యతలు అప్పగిస్తూ ఈయన్‌సీ ఎం.ప్రభాకర్‌రావు ఉత్తర్వులు జారీ చేశారు. ఏడుకొండలు ఎస్ఈగా పదోన్నతి పొందే ప్యానెల్‌లో ఉన్నారు. ఈ నెలలో రెగ్యులర్ పర్యవేక్షక ఇంజనీర్‌గా పదోన్నతి పొందనున్నారు. ప్రాజెక్టుల్లో కీలకంగా పనిచేస్తున్న ఏడుకొండలకు నీటి సరఫరా విభాగం పనులు కూడా సమర్థవంతంగా నిర్వహిస్తారని ఇంజనీరింగ్ విభాగంలో ప్రచారం సాగుతుంది. రాష్ట్రంలో ముగ్గురు ఎస్ఈలు పదవి విరమణ చేశారు.

## ప్రశాంత్‌కు పవన్ కల్యాణ్ అభినందన

విశాలాంధ్ర బ్యూరో- విశాఖపట్నం: దుబాయ్, అబూదాబిలలో సెప్టెంబర్ 9 నుంచి ప్రారంభమయ్యే ఆసియా కప్ 20 - 20 క్రికెట్ పోటీలకు టీమిండియా మేనేజర్‌గా నియమితులైన పి.వి.ఆర్. ప్రశాంత్‌ను డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ అభినందించారు. భీమవరం ఎమ్మెల్యే (జనసేన), పీఏసీ చైర్మన్ పులపర్తి రామాంజనేయులు (అంజిబాబు) కుమారుడైన ప్రశాంత్ విశాఖ పర్యటనలో ఉన్న పవన్ కల్యాణ్‌ను శనివారం మర్యాద పూర్వకంగా కలిశారు. తెలుగు వ్యక్తికి ఇలాంటి అరుదైన గౌరవం దక్కడం పట్ల పవన్ కల్యాణ్ ఆనందం వ్యక్తం చేశారు. భవిష్యత్‌లో ప్రశాంత్ మరిన్ని ఉన్నత పదవులను అధిరోహించాలని ఆకాంక్షించారు. ఆంధ్ర క్రికెట్ సంఘం (ఏసీఏ) ఉపాధ్యక్షుడిగా పని చేసిన ప్రశాంత్ భీమిలి ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు అల్లుడు. గతంలో ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లా నుంచి క్రికెట్‌కు ప్రాతినిధ్యం వహించారు.

# నాడు జగన్ ప్యాలెస్ అంటూ తప్పుడు కూతలు

**- అవే నిర్మాణాలకు ప్రభుత్వ భవనాలని నేడు జీవో ఎలా ఇచ్చారు...?**
**- మాజీ మంత్రి అమర్నాథ్ ఆగ్రహం**

విశాలాంధ్ర - విశాఖ సిటీ: నాడు ఋషికొండ నిర్మాణాలను జగన్ పాలస్ అంటూ కూటమి నేతలు తప్పుడు కూతలు కూశారని అనకాపల్లి జిల్లా వైసీపీ అధ్యక్షుడు, మాజీ మంత్రి గుడివాడమర్నాథ్ ఆగ్రహం వ్యక్తం చేశారు. శనివారం నగర వైసీపీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. అదే నిర్మాణాలను ఇప్పుడు ప్రభుత్వ భవనాలుగా జీవో ఎలా జారీ చేశారని ప్రశ్నించారు. ఎన్నికలకు ముందు, అధికారంలోకి వచ్చిన తరువాత కూడా రిషికొండ రిసార్ట్స్‌పై చంద్రబాబు, పవన్, లోకేష్‌లు ఎలాంటి దుష్ప్రచారం చేశారో మరిచిపోయారా అని నిలదీశారు. ప్రభుత్వ పరంగా నిర్మించిన ఈ నిర్మాణాలపై సిగ్గు లేకుండా, ఇష్టారాజ్యంగా మాట్లాడిన నేతలు ఇప్పుడు వాటిని ప్రభుత్వ భవనాలే అంటూ సమర్థించుకుంటున్నారని, గతంలో తాము చేసిన విష ప్రచారానికి ప్రజలకు క్షమాపణలు చెప్పాలని డిమాండ్ చేశారు. ఆనాడు మా పార్టీ విధానం ప్రకారం విశాఖను ఎగ్జిక్యూటివ్ రాజధానిగా చేస్తే ఇక్కడి నుంచి పాలన సాగిస్తామని చెప్పామని, ముగ్గురు అధికారుల కమిటీ నిర్ణయం మేరకు రుషికొండ రిసార్ట్స్ ముఖ్యమంత్రికి, కాపులుప్పాడలో ప్రధాన పరిపాలన భవనాల నిర్మాణం చేస్తే బాగుంటుందని సిఫార్స్ చేశారన్నారు. అందుకు అనుగుణంగానే నిర్మాణాలు చేపట్టడం జరిగిందన్నారు. కూటమి నేతలు విశాఖలో ఈవెంట్లు... అమరావతిలో పేమెంట్లు సాగిస్తున్నారని విమర్శించారు. స్టీల్ ప్లాంటు ప్రైవేటీకరణపై కూటమి నేతల ద్వంద్వ వైఖరితో వ్యవహరిస్తున్నారని ధ్వజమెత్తారు.

## అన్నదానానికి అపూర్వ స్పందన

విశాలాంధ్ర - ఆనందపురం: ఆనందపురం మండలం వేములవలస పతివాడ వీధిలో వినాయక నవరాత్రుల సందర్భంగా ఏర్పాటు చేసిన భారీ అన్నదానానికి భక్తుల నుండి అపూర్వ స్పందన లభించింది. ఈ అన్నదానానికి స్థానిక పంచాయతీ ఉప సర్పంచ్ కోరాడ నవీన్ జ్ఞానేశ్వర్ 15 వేల రూపాయలు ఆర్థిక సాయం అందజేశారు. అలాగే వేములవలస బీసీ కాలనీ బంటుపల్లి కల్లాలకు వెళ్లే రోడ్డులో ఏర్పాటు చేసిన విగ్రహానికి తన వంతు సహాయంగా 15 వేల రూపాయలు ఉత్సవ కమిటీకి అందించినట్లు కోరాడ నవీన్ జ్ఞానేశ్వర్ తెలిపారు.

## ఇంద్రజాలికుడు బిఎస్ రెడ్డిని ప్రశంసించిన మంత్రి నారా లోకేశ్

విశాలాంధ్ర - విశాఖ కలెక్టరేట్: 2025కి గాను బెస్ట్ ఇల్యూషనిస్టుగా "ఆస్కార్ ఆఫ్ మ్యాజిక్" ఇంటర్నేషనల్ అవార్డు ఇటీవల అమెరికాలో అందుకున్న ప్రముఖ అంతర్జాతీయ ఇంద్రజాలికుడు, విశాఖ వాసి డా. బిఎస్ రెడ్డిని విద్య, ఐటీ శాఖ మంత్రి నారా లోకేశ్ మాజీ మంత్రి, భీమిలి ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావుతో కలిసి ప్రశంసించి, శుభాకాంక్షలు తెలియజేసారు. డా. బిఎస్ రెడ్డి ప్రజలకు చేరువయ్యే మరిన్ని ప్రదర్శనలిచ్చి, క్రొత్త తరం ఇంద్రజాలికులను మరింత మందిని తయారు చేయడానికి కృషి చేస్తున్నందుకు, చాలా సంతోషంగా ఉందని కొనియాడారు.

## మోదీ ప్రభుత్వం రైతు వ్యతిరేకి: ప్రియాంక దండి

విశాలాంధ్ర - విశాఖ కలెక్టరేట్: మోదీ ప్రభుత్వం రైతుల మీద పక్షపాతం చూపిస్తుందని, గతంలో మూడు నల్ల వ్యవసాయ చట్టాలు తీసుకువచ్చి దేశంలో వ్యవసాయం కార్పొరేట్ల చేతిలో పెట్టాలనుకుందని కాంగ్రెస్ పార్టీ విశాఖ తూర్పు నియోజకవర్గ ఇన్‌చార్జ్ ప్రియాంక దండి ఆరోపించారు. ఆగస్టు 18న మోదీ ప్రభుత్వం అమెరికా నుండి దిగుమతి చేసుకొనే పత్తికి డ్యూటీని రద్దు చేసిందన్నారు. ఇది సెప్టెంబర్ 30 వరకు అమల్లో ఉంటుందని, సహజంగా పత్తి మీద మన దేశం 11% డ్యూటీ విధిస్తుందని, ట్రంప్ ఇప్పటికే చాలా దేశాల మీద 50% డ్యూటీ విధించారన్నారు. ఇతర దేశాలు కూడ అమెరికా పై 50% వరకు డ్యూటీ విధించారని, ట్రంప్ కి చాలా దేశాలు భయపడలేదని, కాని మోదీ ప్రభుత్వం ట్రంప్‌కి భయపడుతోందన్నారు. మోదీ ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం వల్ల పత్తి అధికంగా పండే తెలంగాణ, పంజాబ్, విదర్భ, మోదీ సొంత రాష్ట్రం గుజరాత్ రైతులు నష్టపోతారన్నారు.

## ఫౌండేషన్ లిటరసీ, న్యూమరసీ చాలా ముఖ్యం

### డైట్ ప్రిన్సిపల్ ఎల్.సుధాకర్

విశాలాంధ్ర - తగరపువలస: చిట్టివలస బాలుర ఉన్నత పాఠశాల నందు జరిగిన పాఠశాల సముదాయ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా విచ్చేసిన భీమునిపట్నం డైట్ ప్రిన్సిపల్ ఎల్.సుధాకర్ మాట్లాడుతూ ముఖ్యంగా విద్యార్థులలో నైపుణ్యాభివృద్ధిని తీసుకురావాలంటే ప్రతి ఉపాధ్యాయుడు ఫౌండేషన్ లిటరసీ, న్యూమరసీపై శిక్షణ పొందాలని అన్నారు. తద్వారా పిల్లలకు చదవడం, రాయడం మరియు గణితంలో ప్రాథమిక నైపుణ్యాల అభివృద్ధి లో మరింతగా మెరుగులు దిద్దవచ్చని తెలియజేశారు. పాఠశాల సముదాయం ఎలా జరుగుతుందో పరిశీలించి పదవ తరగతి పాఠ్యాంశ బ్లూ ప్రింట్ పై ఉపాధ్యాయులతో చర్చించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల సముదాయ ప్రధానోపాధ్యాయుడు డి.ఆదినారాయణ, డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ జీవీఎంసీ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు వై.స్వామి, దాకమర్రి ప్రధానోపాధ్యాయురాలు వి.వి. హిమబిందు, చిట్టివలస బాలికల ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు టి.శివ జ్యోతి సిఆర్పి టి. త్రినాథ్ వివిధ పాఠశాలల ప్రధానోపాధ్యాయులు స్కూల్ అసిస్టెంట్లు, సెకండరీ గ్రేడ్ ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

## సెట్విన్ సిఈఓ సత్యనారాయణ సేవలు ఆదర్శనీయం

### ఎస్సీ కార్పొరేషన్ ఈడి ఎం.సత్యపద్మ

విశాలాంధ్ర - విశాఖ కలెక్టరేట్: సెట్విన్ కార్యాలయంలో ముఖ్యకార్యనిర్వహణ అధికారిగా ఉత్తమ సేవలు అందిస్తూ సెట్విన్ ఖ్యాతిని పెంచిన పి.వి.ఎన్.సత్యనారాయణను ఎస్సీ కార్పొరేషన్ ఎక్జిక్యూటివ్ డైరెక్టర్ ఎం.సత్య పద్మ హృదయపూర్వకంగా అభినందించారు. శనివారం జిల్లా కార్యాలయంలో జరిగిన పదవీ విరమణ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా మాట్లాడారు. పి.వి.ఎన్. సత్యనారాయణ 34 సంవత్సరాల సుదీర్ఘ సేవలో ఎల్లప్పుడూ నిబద్ధతతో, సంయమనంతో విధులు నిర్వహించారని కొనియాడారు. ఉమ్మడి రాష్ట్రంలో 1991లో విజయనగరం జిల్లాలో సెట్విన్ కార్యాల యంలో లోన్ రికవరీ అధికారిగా విధులను ప్రారంభించి అంచలంచెలుగా ఎదుగుతూ విశాఖ జిల్లో సెట్విన్ సీఇఓ గా నేడు పదవీ విరమణ చేస్తున్నారని అన్నారు. ఆయన విధులలో క్రింది స్థాయి సిబ్బందికి ఆదర్శంగా నిలిచి తనదైన శైలిలో నిపుణతను ప్రదర్శించారని చెప్పారు. ఈ పదవీ విరమణ కార్యక్రమంలో సహాయ సంచాలకులు ఎస్ లక్ష్మణ్, శ్రీకాకుళం సీఈఓ అప్పలనాయుడు, శ్రీకాకుళం జిల్లా ఎంప్లాయిమెంట్ అధికారి సిహెచ్ సుబ్బిరెడ్డి, మాజీ సెట్విన్ సీఈఓ పి నాగేశ్వరరావు, టీవీ ప్రసాద్ రావు, సూపరింటెండెంట్ సుధాకర్, సెట్విన్ కార్యాలయ సిబ్బంది, సమాచార శాఖ కార్యాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## ఎన్ఎస్ఆర్ఐటీలో పట్టభద్రుల వేడుక

విశాలాంధ్ర - ఆనందపురం: ఆనందపురం మండలం శొంఠ్యాం నడింపల్లిసత్యనారాయణ రాజు ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ ( ఎన్ఎస్ఆర్ఐటి)లో పట్టభద్రుల వేడుక 2025 ఆగస్టు 30న వ్యవస్థాపకులు నడింపల్లి సత్యనారాయణ రాజు సారథ్యంలో ఘనంగా జరిగింది. జెఎన్‌టీయూ-జీవి, విజయనగరం రిజిస్ట్రార్ ప్రొఫెసర్ జి. జయ సుమ ముఖ్య అతిథిగా హాజరై విద్యా విధానాలు, పరిశ్రమ-విద్యాసంస్థల అనుసంధానం, నూతన సాంకేతికతలలో స్కిల్స్ పెంపు అవసరాన్ని వివరించారు. హెచ్‌సీఎల్ గువి పీపుల్ స్ట్రాటజీ హెచ్‌ఆర్ హెడ్ కంచన్ ఖేడ్కర్ మాట్లాడుతూ ఈ రోజుల్లో ఉద్యోగాల కోసం ఎదుర్కోవాల్సిన సవాళ్లను వివరిస్తూ, విద్యార్థులను సమయపాలన, క్రమశిక్షణతో ముందుకు సాగాలని ప్రోత్సహించారు. జామియా మిల్లియా ఇస్లామియా, న్యూ ఢిల్లీలోని సిఎస్ఇ విభాగాధిపతి ప్రొఫెసర్ డాక్టర్ మహమ్మద్ అంజాద్ మాట్లాడుతూ కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజినీరింగ్ తాజా ధోరణులు ఐటీ రంగంలో ఉన్న ఉద్యోగావ కాశాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో డాక్టర్ ఎన్. ప్రసాద రాజు, కార్యదర్శి, ఎన్.కనక రాజు, ఖజానా దారు, డాక్టర్ ఎస్.శంభు ప్రసాద్, ప్రిన్సిపాల్, డాక్టర్ పి.ఎస్.రాజు, చీఫ్ మేనేజ్‌మెంట్ ఆఫీసర్‌అన్ని అకాడెమిక్ హెడ్స్ హాజరై విద్యార్థులకు ఆశీస్సులు అందించారు.

## ఆదిత్యా డిగ్రీ కళాశాలలో గిడుగు జయంతి

విశాలాంధ్ర - పెందుర్తి : గోపాలపట్నం ఆదిత్యా డిగ్రీ కళాశాల ( కో ఎడ్యుకేషన్ క్యాంపస్ ) లో వ్యావహారిక తెలుగు భాషా వైతాళికుడు గిడుగు వేంకట రామమూర్తి జయంతి వేడుకలు ఘనంగా జరిగాయి. తెలుగు భాషా దినోత్సవం వేడుకలను పురస్కరించుకొని విద్యార్థినీ విద్యార్థులు, కళాశాల అధ్యాపక బృందం పలు కార్యక్రమాలు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి సీనియర్ జర్నలిస్టు, రచయిత జంధ్యాల శరత్ బాబు ముఖ్య అతిథిగా హాజరై గిడుగు వారి భాషా సేవ, ఉద్యమ నేపథ్యాన్ని కళాశాల విద్యార్థినీ విద్యార్థులకు తెలియజేశారు. గౌరవ అతిథిగా మరో సీనియర్ జర్నలిస్టు నరసింహం కోడుగంటి ( కే వీ ఎస్ నరసింహం ) పాల్గొని తెలుగు భాషా సాహిత్యాలు, విద్యార్థులు అవలంభించాల్సిన పద్ధతులను వివరించారు. ఆదిత్యా డిగ్రీ కళాశాల గోపాలపట్నం ఆచార్యులు కే మురళీమోహన్ రావు అధ్యక్షతన సభ కొనసాగింది. తెలుగు భాషా దినోత్సవం వేడుకలను పురస్కరించుకుని విద్యార్థినీ విద్యార్థులకు నిర్వహించిన వివిధ సాంస్కృతిక పోటీల్లో విజేతలుగా నిలిచిన వారికి బహుమతులను, ధ్రువ పత్రాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో కళాశాల ఉప ప్రాచార్యులు కె ఇంద్రనీల్, తెలుగు విభాగాధిపతి గణపతితో పాటు అధ్యాపకులు, అధ్యాపకేతర సిబ్బంది పాల్గొన్నారు.

## వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలి

విశాలాంధ్ర - విశాఖపట్నం: వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలని లయన్స్ క్యాన్సర్ ఆసుపత్రి మేనేజింగ్ ట్రస్టీ, ఏయు మాజీ రిజిస్ట్రార్ ఆచార్య వెలగపూడి ఉమామహేశ్వరరావు సూచించారు. కొన్ని వ్యాధులు సీజనల్‌గా వస్తాయని, మరికొన్ని జన్యుపరంగా, ఆహార, జీవన శైలిగా వస్తాయని పేర్కొన్నారు. సీజనల్‌గా వచ్చే వాటిలో కండ్ల కలకలు ఒకటన్నారు. కండ్ల కలకలు లక్షణాలు, జాగ్రత్తల గురించి ఆయన వివరించారు. వర్షాకాలంలో అధిక తేమ కారణంగా కండ్లకలక కేసులు పెరిగే అవకాశం ఉందన్నారు. కళ్ళు ఎరుపుగా మారడం, దురద, కళ్ళు నీరు కారడం, కనురెప్పలు కలిసి అతుక్కుపోవడం జరుగుతుందన్నారు. కండ్లవాపులు, కళ్ళ మంటలు, నొప్పి, అస్పష్టంగా కనబడటం జరుగుతుందన్నారు. ఈ లక్షణాలు ఒకటి లేదా రెండు కళ్లకు కనిపించవచ్చు అని, సంక్రమణ కండ్ల కలకలు, బ్యాక్టీరియల్ కలకలు, అలర్జీ కలకలు అని మూడు రకాలుగా ఉంటాయన్నారు. పాఠశాలలు, డే కేర్ సెంటర్లలో కండ్లకలక ఎక్కువగా వ్యాప్తి చెందే అవకాశం ఉందన్నారు. నవజాత శిశువులకు ప్రసవ ప్రక్రియలో తల్లి నుండి బిడ్డకు సంక్రమించే సూక్ష్మజీవుల వల్ల సంభవిస్తుందని, వివిధ రకాలైన కండ్ల కలకలు ఉన్నాయి. ప్రతి రకానికి చికిత్స భిన్నంగా ఉంటుంది కాబట్టి లక్షణాలు కనిపించిన వెంటనే నేత్ర వైద్యుడిని సంప్రదించడం మంచిదన్నారు. మంచి పరిశుభ్రతను పాటించడం ద్వారా కండ్లకలక వ్యాప్తిని నివారించవచ్చు అన్నారు.

## బెంగాల్ వారియర్జ్ బీచ్ కబడ్డీ లీగ్‌ను గెలుచుకున్న చంద్రపాలెం జిల్లా పరిషత్ హైస్కూల్

విశాలాంధ్ర - విశాఖపట్నం: పికెఎల్ సీజన్ 12లో వారి ప్రారంభ ఆటకు ముందు, వైజాగ్‌లోని పాఠశాలల కోసం బెంగాల్ వారియర్జ్ చాలా ఆలోచనాత్మకమైన మరియు ఆనందించే చొరవను రూపొందించింది, ఇది మొట్టమొదటి బెంగాల్ వారియర్జ్ బీచ్ కబడ్డీ లీగ్‌ను నిర్వహించింది. ఈ పోటీ వైజాగ్‌లోని ఐకానిక్ ఆర్‌కె బీచ్‌లో జరిగింది. బీచ్‌లో వరుసగా జరిగిన ఉత్కంఠభరితమైన మ్యాచ్‌లు మరియు ఉత్కంఠభరితమైన పోటీల తర్వాత, చంద్రపాలెం, మదువాడ నుండి వచ్చిన జిల్లా పరిషత్ హైస్కూల్ బాలుర, బాలికల పోటీలలో టైటిల్‌ను గెలుచుకుంది. రెండు ఫైనల్స్‌లోనూ, చంద్రపాలెం, మదువాడలోని జిల్లా పరిషత్ హై స్కూల్ గోపాలపట్నం నుండి హై స్కూల్ (బాలురు మరియు బాలికలు)తో తలపడింది. బాలికల ఫైనల్‌లో చంద్రపాలెం, మదువాడలోని 50-11 తేడాతో గెలిచింది, మరియు బాలుర ఫైనల్‌లో వారు 37-12 తేడాతో గెలిచారు. ట్రోఫీని కాంటాక్ట్ స్పోర్ట్స్, కాప్రి స్పోర్ట్స్ డైరెక్టర్, బెంగాల్ వారియర్జ్ కెప్టెన్ దేవంక్ దలాల్, ప్రధాన కోచ్ నవీన్ కుమార్ విద్యార్థులకు అందజేశారు. బెంగాల్ వారియర్జ్‌కు చెందిన జాంగ్ కున్ లీ మరియు విశ్వాస్ ఎస్ కూడా హాజరయ్యారు. ఆగస్టు 31న డిఫెండింగ్ ఛాంపియన్స్ హర్యానా స్టీలర్స్‌తో తలపడే పికెఎల్ సీజన్ 12లో బెంగాల్ వారియర్జ్ తొలి ఆటను చూడటానికి మదువాడలోని చంద్రపాలెం నుండి జిల్లా పరిషత్ హైస్కూల్‌కు కూడా ఆహ్వానం అందింది. బెంగాల్ వారియర్జ్ వైజాగ్‌లో మరో మూడు ఆటలు ఆడనుంది, సెప్టెంబర్ 7న స్వదేశీ జట్టు తెలుగు టైటాన్స్‌తో ఒక మ్యాచ్ జరగనుంది. ఈ సందర్భంగా కాప్రి స్పోర్ట్స్ డైరెక్టర్ - కాంటాక్ట్ స్పోర్ట్స్ అపూర్వ్ గుప్తా మాట్లాడుతూ, "ఈ రోజుల్లో వైజాగ్‌లో బెంగాల్ వారియర్జ్ బీచ్ కబడ్డీ లీగ్‌కు ఉత్సాహం తిరుగులేని మద్దతు లభించడం చూసి మేము సంతోషిస్తున్నామన్నారు.

## రాష్ట్ర ప్రచార కార్యదర్శిగా ఎ.వి.వి.ఎస్.నారాయణ

విశాలాంధ్ర బ్యూరో- విశాఖపట్నం: ప్రజా రవాణా శాఖ, వైఎస్సార్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ రాష్ట్ర ప్రచార కార్యదర్శిగా ఎ.వి.వి.ఎస్ నారాయణ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఇటీవల విజయవాడలోని ప్రెస్ క్లబ్ లో జరిగిన రాష్ట్ర రెండోవ మహాసభలో సభ్యులు నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ నూతన కమిటీలో రాష్ట్ర గౌరవ అధ్యక్షుడుగా జి.వి.రావు, కార్యనిర్వాహక అధ్యక్షుడుగా టి.రవిశంకర్, అధ్యక్షుడుగా గెత్తం శ్రీనివాసరావు, ఉపాధ్యక్షులుగా టి.రాజేంద్ర, రవిబాబు, దేముడు, ప్రధాన కార్యదర్శిగా ప్రసాద్ రెడ్డి, ఉప ప్రధాన కార్యదర్శిగా కె.వి.శ్రీధర్, కార్యదర్శులుగా ఎస్.వి.రావు, సుజనా, కోశాధికారిగా పి.వి.రావులతోపాటు మరికొందరి సభ్యులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమనికి ముఖ్య అతిథిగా పాల్గొన్న ఆంధ్ర ప్రదేశ్ ప్రభుత్వ ఉద్యోగుల ప్రధాన కార్యదర్శి జి.ఆస్కార రావు మాట్లాడుతూ ప్రజా రవాణా శాఖ ఉద్యోగుల సమస్య పరిష్కారానికి కృషి చేస్తామని తెలిపారు. అనంతరం ఇటీవల ఉద్యోగ విరమణ చెందిన సంఘం మాజీ రాష్ట్ర అధ్యక్షుడు ఆర్. దేవరాజులు, ఉప ప్రధాన కార్యదర్శి జి.ప్రకాష్ రావులను ఘనంగా సన్మానించారు.

## వరలక్ష్మినగర్లో శ్రీ వరసిద్ధి వినాయక ఉత్సవాలు

విశాలాంధ్ర - పెందుర్తి: జీవీఎంసీ 95వ వార్డు వరలక్ష్మినగర్లో శ్రీ వరసిద్ధి వినాయక ఉత్సవాలు వైభవంగా నిర్వహించారు. వరలక్ష్మినగర్ యూత్ క్లబ్ ఆధ్వర్యంలో జరిగిన వేడుకల్లో యూత్ క్లబ్ ఆహ్వానం మేరకు ముఖ్య అతిథిగా పెందుర్తి బిజెపి నాయకులు, జీవీఎంసీ 95వ వార్డు కార్పొరేటర్ ముమ్మన దేముడు పాల్గొని, బొజ్జ గణపయ్య స్వామి వారికి ప్రత్యేక పూజలు చేసారు, అనంతరం యూత్ క్లబ్ ఏర్పాటు చేసిన అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభించిన కార్పొరేటర్ భక్తులకు అన్న ప్రసాదాలు వడ్డించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బొజ్జ గణపయ్య స్వామి దివ్య ఆశీస్సులు ఈ ప్రాంత ప్రజలపై మెండుగా ఉండాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో వరలక్ష్మినగర్ యూత్ క్లబ్ సభ్యులు, కోలనీ ప్రతినిధులు అప్పికొండ రాంబాబు, గంట్ల నర్సింహా మూర్తి, కోన కళ్యాణ్, ప్రభాకర్, గోపాల్, భాగ్యలక్ష్మి,వేణు,అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు,

# జీవీఎంసీలో 18 మంది ఉద్యోగుల పదవీ విరమణ

విశాలాంధ్ర బ్యూరో - విశాఖపట్నం: మహా విశాఖపట్నం నగర పాలక సంస్థలో ఎంతో బాధ్యతగా సుదీర్ఘకాలం ఉద్యోగ విధులు నిర్వహించి నేడు ఉద్యోగ విరమణ పొందుతున్న ప్రతి ఒక్కరి శేష జీవితం ఆనందదాయకంగా ఉండాలని కోరుకున్నట్లు జీవీఎంసీ అదనపు కమిషనర్ డి.వి.రమణమూర్తి పేర్కొన్నారు. శనివారం ఆయన మహా విశాఖపట్నం నగర పాలక సంస్థ లో వివిధ హోదాలలో విధులు నిర్వహించి ఉద్యోగ విరమణ పొందుతున్న ఉద్యోగులను జీవీఎంసీ డివిఒ ఎల్.సురేష్ తో కలిసి సన్మానించారు. ఈ సందర్భంగా అదనపు కమిషనర్ మాట్లాడుతూ ప్రతి ఉద్యోగి తన ఉద్యోగ కాలంలో తన కుటుంబము కంటే అధిక కాలాన్ని సంస్థ కొరకు పని చేశారని పేర్కొన్నారు. నేడు ఉద్యోగ విరమణ పొందుతున్న ఒక పర్యవేక్షక ఇంజనీరు 0 8, పర్మినెంట్ ఉద్యోగుల తో పాటు 09 మంది పొరుగు సేవల సిబ్బంది తో కలిపి మొత్తం 18 మంది ఉద్యోగ విరమణ పొందారని, వారిలో పర్యవేక్షక ఇంజనీరు కె.వి.ఎన్.రవి, సీనియర్ అసిస్టెంట్ వై.మూర్తి, జూనియర్ అసిస్టెంట్ సిహెచ్ వెంకటేశ్వర్లు, ఆఫీస్ సబార్డినేట్ విద్యాధర బెహరా, మజ్దూర్లు, పి.హెచ్ వర్కర్లు, 7 గురు పొరుగు సేవల పి.హెచ్ వర్కర్లు, బాల్యం టీచర్ వి.రాజేశ్వరి, వాచ్మెన్ ఏ అప్పారావు వాచ్మెన్ ఏ. అప్పారావు లు ఉద్యోగ విరమణ నేడు పొందారన్నారు. అనంతరం జీవీఎంసీ అదనపు కమిషనర్ చేతుల మీదగా పదవి విరమణ పొందుతున్న ఉద్యోగులకు సంబంధించిన ప్రావిడెంట్ ఫండ్ సుమారు రూ.49, 12,242/- రూపాయలను అందించి పూలమాలలతో సత్కరించి జ్ఞాపికలను అందించి అభినందించారు. ఈ కార్యక్రమంలో జివిఎంసి జెమ్స్ యూనియన్ నాయకులు, జివిఎంసి ఉద్యోగులతో పాటు మాజీ ఉద్యోగులు, పదవి విరమణ పొందుతున్న ఉద్యోగుల కుటుంబ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

## యాచక రహిత నగరంగా విశాఖ: సీపీ

విశాలాంధ్ర - విశాఖ క్రైమ్: దేశంలోనే ఎక్కడా లేని విధంగా విశాఖ నగరాన్ని యాచక రహిత నగరంగా మార్చే దిశగా కమీషనర్ డా.శంఖబ్రత బాగ్చి జ్యోతిర్గమయ కార్యక్రమం ద్వారా, విశాఖ మహా నగరంలో భిక్షాటన చేస్తున్న 243 యాచకులను రెస్క్యూ చేసి, వారికి నగరంలో పలు ఆశ్రమాలలో ఆశ్రయం కల్పించిన విషయం విధితమే. 243 మంది యాచకులలో వారి బంధువులకు, ఆశ్రయాల నిర్వాహకులకు అప్పగించగా మిగిలి ఉన్న 128 మంది యాచకులకు నగర పోలీసు కమిషనర్ ఆదేశాల మేరకు నగర పోలీసులు, జీవీఎంసీ వారి డే నైట్ హోం లెస్ షెల్టర్ వారి ఆధ్వర్యంలో ఆధార్ సేవా కేంద్రం, ద్వారకా నగర్ వారి సహాయంతో వారికి ఆధార్ ఉన్నదీ, లేనిదీ తెలుసుకున్నారు. సీపీ సదరు కార్యక్రమానికి విచ్చేసి వెరిఫికేషన్ ప్రక్రియను స్వయంగా పరిశీలించడంపై పలువురు ప్రజలు అభినందించారు.

## గృహిణులకు స్పోకెన్ ఇంగ్లీష్‌లో ఉచిత శిక్షణ

విశాలాంధ్ర - విశాఖ: గృహిణులకు స్పోకెన్ ఇంగ్లీష్‌లో రెండు నెలల పాటు ఉచిత శిక్షణ ఇవ్వనున్నట్టు గృహిణి స్పోకెన్ ఇంగ్లీష్ స్వచ్ఛంద సేవా సంస్థ వ్యవస్థాపకుడు దామోదర మనోహర్ తెలిపారు. రామా టాకీస్ సమీపంలోని కెనరా బ్యాంక్ ఎదురుగా శ్రీకృష్ణ ట్రావెల్స్ మేడ పైన ఉన్న సంస్థ కార్యాలయంలో ఈ శిక్షణా తరగతులు ఉంటాయని తెలిపారు. సెప్టెంబర్ 1 నుండి అక్టోబర్ 31 వరకు ఉదయం పది నుండి 11:30 వరకు శిక్షణ తరగతులు జరుగుతాయని చెప్పారు. వివరాలకు 80193 88999 నెంబర్ ను సంప్రదించాలని కోరారు.

## మద్దిలో స్మార్ట్ రేషన్ కార్డులు పంపిణీ

విశాలాంధ్ర - పద్మనాభం: పద్మనాభం మండలం మద్ది పంచాయతీ పరిధిలో శనివారం మద్ది గ్రామంలో స్మార్ట్ రేషన్ కార్డులు పంపిణీ కార్యక్రమం చేపట్టారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన స్థానిక ఎంపీపీ కే.రాంబాబు స్మార్ట్ రేషన్ కార్డులు పంపిణీ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మన భవిష్యత్తు అంతా టెక్నాలజీ, డిజిటలైజేషన్, ఏఐతో ముడిపడి ఉండటం వల్ల భవిష్యత్తుకు అనుగుణంగా ఈ స్మార్ట్ రేషన్ కార్డులు తయారు చేసినట్టు తెలిపారు. ఈ కార్యక్రమంలో రేషన్ కార్డు లబ్ధిదారులు, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# మహిళా విభాగం సంస్థాగతంగా బలోపేతం కావాలి

విశాలాంధ్ర - విశాఖ సిటీ: వై.యస్.ఆర్ కాంగ్రెస్ పార్టీ విశాఖపట్నం జిల్లా కార్యాలయంలో స్టాండింగ్ కమిటీ మెంబర్ సాడి పద్మారెడ్డి ఆధ్వర్యంలో విశాఖ ఉత్తర నియోజకవర్గ మహిళా విభాగం ఆత్మీయ సమావేశం జరిగింది. ఈ సమావేశంలో విశాఖపట్నం జిల్లా వైసీపీ పార్టీ అధ్యక్షులు,విశాఖ ఉత్తర నియోజకవర్గ సమన్వయకర్త కె.కె రాజు విశాఖ పార్లమెంట్ పరిశీలకులు కదిరి బాబురావు పాల్గొన్నారు. ఈ సందర్భంగా కె.కె రాజు మాట్లాడుతూ వైసిపి ప్రభుత్వం అధికారంలో ఉన్నప్పుడు నాటి ముఖ్యమంత్రి వరులు వై.యస్ జగన్మోహన్ రెడ్డి ప్రవేశ పెట్టిన సంక్షేమ పథకాలలో,నామినేటెడ్ పదవుల్లో ఎక్కువ శాతం మహిళలకే పెద్ద పీట వేసారని అన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాకముందు ఈరాష్ట్రంలో ఉన్న మహిళలకు మోసపూరిత హామీలు ఇచ్చి ముఖ్యంగా 18 సంవత్సరాలు నిండిన ప్రతి మహిళలకు ప్రతి నెల 1500 రూపాయలు ఇస్తామని, ఉచిత గ్యాస్ సిలిండర్లు అందజేస్తామని హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చిన తర్వాత మహిళల సంక్షేమము విషయంలో కక్ష పూరితంగా వ్యవహరిస్తుందని మండిపడ్డారు. ఈ సమావేశంలో జిల్లా మహిళా విభాగం అధ్యక్షురాలు పేడాడ రమణికుమారి, 55వ వార్డు కార్పొరేటర్ కె.వి.యస్.శశికళ, రాష్ట్ర మహిళ విభాగం ప్రధాన కార్యదర్శి శ్రీదేవి, జిల్లా అధికార ప్రతినిధి మంచ నాగమల్లీశ్వరి,వార్డు మహిళ అధ్యక్షురాల్లు, నియోజకవర్గ మహిళ నాయకురాల్లు పాల్గొన్నారు.

## బాధితులకు సత్వర సాంత్వన అవసరం

విశాలాంధ్ర - పెందుర్తి: పర్యావరణ మార్పుల దుష్ప్రభావాలు అనూహ్య విపరిత పరిణామాలకు దారి తీస్తున్నాయని బిజేపీ నేత మూల వెంకటరావు ఆవేదన వెలిబుచ్చారు. దేశీయ జీవావరణ, ఆర్థిక వ్యవస్థలకు ప్రాణావసరమైన రుతుపవనాలను అవి గాడి తప్పిస్తున్నాయన్నారు. ఎడతెరవి లేని వానలకు రాష్ట్రంలో పలు ప్రాంతాలు జలదిగ్బంధంలో చిక్కు కున్నాయని, ముసురేసిన వాతావరణంలో ఇప్పటికే విషజ్వరాలు విజృంభిస్తున్నాయన్నారు. దాని ప్రభావంతో దగ్గు, వాంతులు, గొంతు నొప్పి తదితర సమస్యలతో చాలా మంది బాధపడుతున్నారన్నారు. ఎక్కడికక్కడ పెరిగిపోతున్న చెత్తా చెదారంతో దోమల సంతతి విపరితంగా పెరిగిపోతుండడంతో డెంగ్యూ, మలేరియా బాదితులు ఎక్కువగా పెరుగుతున్నారని పేర్కొన్నారు. కాబట్టి గ్రామాలు, పట్టణాల వారీగా పరిస్థితి సమీక్షిస్తూ పారిశుద్య స్థితిగతులను మెరుగుపరచడంపై ప్రభుత్వం గట్టిగా దృష్టి సారించాలన్నారు.